సాక్షి కర్నూలు

సోమవారం, 19, జూన్, 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



1.1 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలువాసుల తాగునీటి అవసరాల నిమిత్తం ఆదివారం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. వేకువజాము నుంచే దర్శనానికి అనుమతించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

24 వరకు ఒంటి పూట బడులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో వేసవి ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న కారణంగా ఒంటిపూట బడులను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఇతర అన్ని యాజమాన్యాల కింద నడుస్తున్న స్కూళ్లలో ఉదయం 7:30 నుంచి 11:30 తరగతులు నిర్వహించాలని సూచించారు. రాగి జావ ఉదయం 8:30 గంటల నుంచి 9లోపు, మధ్యాహ్న భోజనం 11:30 నుంచి మధ్యాహ్నం 12గంటల్లోపు ఇవ్వాలని తెలిపారు.

ఎంఈఓ-2 పోస్టులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు

కర్నూలు సిటీ: జిల్లా పరిషత్ యాజమాన్య పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పని చేస్తున్న వారికి ఎంఈఓ-2లుగా పదోన్నతులు కల్పించేందుకు ఆదివారం కర్నూలు ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. సీనియారిటీ జాబితాలను ప్రదర్శించి ఎంఈఓలుగా పనిచేసేందుకు అంగీకరించిన 55 మందికి పదోన్నతులు కల్పించి స్థానాలను కేటాయించారు. ఉత్తర్వులు పొందిన వారు వెంటనే ప్రస్తుతం పని చేస్తున్న చోట నుంచి రిలీవ్ అయి పదోన్నతి పొందిన స్థానంలో సోమవారం విధుల్లో చేరాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల డీఈఓలు రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, ఏడీ శ్యామ్యూల్ పాల్, పర్యవేక్షకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

మంత్రాలయం: ఎమ్మిగనూరు నుంచి రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని మాదవరం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సెబ్ సీఐ శ్రీరాములు, ఎస్‌ఐ కిరణ్ పట్టుకున్నారు. మాధవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం మాన్వికి చెందిన శరణబసవ అనే వ్యక్తి తన లారీలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి వద్ద రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. విషయాన్ని తెలుసుకుని లారీని, అందులోని 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.



రేషన్ బియ్యం లారీ వద్ద సెబ్ అధికారులు

ప్రకృతికి ప్రాధాన్యం



ప్రకృతి వ్యవసాయంతో కళకళలాడుతున్న పైర్లు

- ప్రకృతి సేద్యం విస్తరణకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఈ ఏడాది 67,818 ఎకరాల్లో చేపట్టే విధంగా లక్ష్యం
- తగ్గుతున్న రసాయన ఎరువుల వాడకం
- కిచెన్‌గార్డెన్‌ల అభివృద్ధికి అవకాశం

ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం



జీవామృతాన్ని తయారు చేస్తున్న ఈ రైతు పేరు శ్రీనివాసులు. కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామానికి చెందిన రైతు. ఎంఎస్సీ, ఎంఈడీ చదవిన ఈయన ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు. ఒకటిన్నర ఎకరాలో సపోట, అర్ధ ఎకరాలో మామిడి, జామ, సీతాఫలం, నిమ్మ అభివృద్ధి చేశారు. ఆరు ఎకరాల్లో కందులు, సజ్జలు ప్రధాన పంటలుగా సాగు చేస్తూ అంతరపంటలుగా మినుములు, అలసంద, పెసర, వంకాయ, టమాట, చౌళకాయ తదితర కూరగాయలతో పాటు ఆకు కూరలు పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైనవన్నీ సొంతంగా తయారు చేసుకుంటారు. అన్ని పంటలకు కలిపి ఏడాదికి రూ.50 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. పెట్టుబడి వ్యయం మినహాయిస్తే నికరాదాయం రూ.5లక్షలకుపైగా ఉంటోంది.

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించే విధంగా.. రసాయన అవశేషాలు లేని పంటలను పండించే విధానాన్ని ప్రోత్సహించేలా.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేసేలా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ హయాంలో ప్రకృతి వ్యవసాయం కాగితాలపై మాత్రమే కనిపించేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యమ తరహాలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ ఏడాది పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

ప్రకృతి వ్యవసాయం సరైన మార్గం

హరిత విప్లవంతో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. మొదట్లో మంచి ఉత్పాదకత సాధ్యం అయినప్పటికీ రానురాను అడ్డు, అదుపు లేకుండా రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో పంటల్లో రసాయన అవశేషాలు ఉన్నట్లు శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. అలాగే పంటలు పండే భూమి కూడా నిస్సారంగా మారుతోంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడటానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే సరైన మార్గమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

తగ్గుతున్న రసాయన ఎరువుల వాడకం...

వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2021-22 సంవత్సరంలో కర్నూలు జిల్లాలో 2,82,492 టన్నుల రసాయన ఎరువులు వినియోగించారు. 2022-23లో 2,57,696 టన్నుల ఎరువులు వినియోగించినట్లు స్పష్టం అవుతోంది. 2021-22తో పోలిస్తే 2022-23లో 24 వేల టన్నుల మేర ఎరువుల వాడకం తగ్గింది. కెమికల్స్ వాడకం తగ్గుతుండటం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడుతోంది.

ఈ ఏడాది లక్ష్యాలు ఇలా....

ఈ ఏడాది మరింత పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేపట్టడానికి రంగం సిద్ధమైంది. 141 గ్రామ పంచాయతీల పరిధిలోని 138 రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ ఏడాది 42,313 మంది రైతులతో 67,818 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలనేది లక్ష్యం. ఇందుకు దేశవాళీ ఆవుల అవసరం ఉంది. ఆవుల మూత్రం, పేడను ఉపయోగించి ఘన, ద్రవ జీవామృతం తదితర వాటిని తయారు చేస్తారు. ఇప్పటి వరకు 3,525 మంది రైతులతో 3,573 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు. అదే విధంగా కిచెన్‌గార్డెన్, ఐదు అంతస్తుల పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచేందుకు పొలంబడి కార్యాక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. పంట దిగుబడులు ఎలా వస్తున్నాయనే దానిని తెలుసుకునేందుకు పంట కోత ప్రయోగాలు జరుపుతున్నారు.



పత్తిలో అంతర పంటల సాగు

పెరటితోటల అభివృద్ధి

గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో రైతుసాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం సెర్ప్‌తో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 269 గ్రామాల్లోని 312 గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆకుకూరలు, కూరగాయల సాగును చేపట్టారు. సెంటు నుంచి 10 సెంట్ల వరకు స్థలంలో పెరటితోటలు అభివృద్ధి చెందాయి. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందచేయాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయపు కిచెన్‌షెడ్లు అభివృద్ధి చేస్తున్నారు.. వీటిల్లో ఆకు కూరలు, కూరగాయలు పండించేందుకు చర్యలు తీసుకోవడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వ్యవసాయం వివరాలు..

సంవత్సరం	రైతులు	ప్రకృతి(ఎకరాల్లో) వ్యవసాయం
2018-19	30,549	30,868
2019-20	42,980	46,462
2020-21	64,988	79,140
2021-22	65,242	78,126
2022-23	32,479	34,892

(కర్నూలు జిల్లా)

సంతృప్తిగా ఉంది



మిరప పొలంలో ఉన్న ఈ రైతు పేరు అనిల్‌కుమార్. పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన రైతు. ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేసిన ఈయన 2018 నుంచి ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాల పంటలు వేసి 30-40 రోజుల తర్వాత రోటావేటర్ ద్వారా భూమిలో కలిపేస్తారు. ఈ పంటలు పచ్చి రొట్ట ఎరువులుగా మారి ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు ఇస్తాయి. పత్తి, వేరుశనగ, మిరప పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో అంతర పంటలుగా సజ్జ, కంది, అలసంద, పిల్లిపెసర, వివిధ రకాల కూరగాయల పంటలు వేస్తున్నారు. మొత్తంగా రూ.2లక్షల వరకు పెట్టుబడి పెడుతుండగా రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

ఐదు అంతస్తుల పంటలసాగు

ప్రకృతి వ్యవసాయంలో ఐదు అంతస్తుల పంటలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఏడాది పొడవునా పొలంలో పంటలు ఉండి రైతులకు ఆదాయాన్ని ఇచ్చే విధంగా ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇందుకోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేస్తున్నారు. ఐదంస్తుల విధానంలో తీగజాతి, కూరగాయలు, దుంపజాతి, జామ, మునగ, కంది, బొప్పాయి, అరటి, అంజూర, మామిడి సాగు చేస్తున్నారు.

రానున్నది ప్రకృతి వ్యవసాయమే

రసాయన అవశేషాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల నేడు ప్రజలు అనేక వ్యాధులతో సతమతం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. గతేడాది పంట దెబ్బతిన్నప్పటికి ప్రకృతి వ్యవసాయంలో మాత్రం ఎకరాకు 7 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండే విధంగా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం.

–చంద్రశేఖర్, డీపీఎం,
జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం



సాక్షి మీడియా, ఆర్‌సీ ఎగ్జామ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు ఎలా సన్నద్ధత కావాలో అధ్యాపకులు వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ, యువకులు స్కాలర్‌షిప్ టెస్టు రాశారు.

- వివరాలు II లో

కారుణ్య నియామకాలపై నేడు సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో కారుణ్య నియామకాలపై సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఆ శాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించి అన్ని జిల్లాల పర్సనల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లతో సమీక్షించనున్నారు. జిల్లా వారీగా ఉన్న ఖాళీ ఉద్యోగాలు, కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల, ఇప్పటి వరకు భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను అడిగి తెలుసుకొని, మిగిలిన వారికి ఉద్యోగాలు ఇచ్చే అంశంపై చర్చించనున్నట్లు సమాచారం.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిశారు!

- ఫలితాల్లో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

కర్నూలు సిటీ/నంద్యాల(న్యూటౌన్): ఐఐటీల్లో విద్యను అభ్యసించేందుకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకు చెందిన ఎస్.తరుణ్ 46వ ర్యాంకు, కె.రాఘవేంద్ర రెడ్డి క్యాటగిరిలో 98వ ర్యాంకు, డా.బిఆర్ అంబేద్కర్ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీ(చిన్నటేకూరు, కల్లూరు మండలం)కి చెందిన కిరణ్‌కుమార్ క్యాటగిరీ విభాగంలో 616వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు అనుగ్య 711, సూర్యతేజ 869, ఎ.వినయ 1,109, పవన్ కుమార్ రెడ్డి 1,519, జె.అక్షయ రావు ఆల్ ఇండియా లెవెల్‌లో 2,887వ ర్యాంకు సాధించారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది.

గురుకుల విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ అకాడమీ డైరెక్టర్ డి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా లెవెల్‌లో కిరణ్‌కుమార్ క్యాటగిరీలో 616వ ర్యాంకు, దుంగావత్ గౌతమ్ నాయక్ 1,374, శక్తి కృపారావు 1,398, నడిమింటి రఘురాం 1,758వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. జంగం విద్యాసాగర్ 1983, చిన్నలింగప్పగారి ప్రవీణ్ 2289, కె.చాంద్ 2932, పరంపాగు సందీప్ 3265, మల్లెపోగు అవన్‌కుమార్ 3967వ ర్యాంకు సాధించారన్నారు.



విద్యార్థి: ఎస్.కృపారావు
తల్లిదండ్రులు: పరుశరాం, జయమ్మ
స్వస్థలం: శ్రీకాకుళం
జేఈఈ ర్యాంకు: 1,398(క్యాటగిరీ)
లక్ష్యం: ఐఏఎస్ కావడం



విద్యార్థి: సంజీవ్ వర్ధన్
తల్లిదండ్రులు: సంజీవ రాయుడు, భారతి
స్వస్థలం: నంద్యాల, జ్ఞానాపురం
జేఈఈ ర్యాంకు: 2,179
లక్ష్యం: ఐపీఎస్ కావడం



విద్యార్థి: ప్రిన్స్ బ్రహ్మంరెడ్డి
తల్లిదండ్రులు: మహేశ్వరరెడ్డి, నాగేశ్వరమ్మ
స్వస్థలం: నంద్యాల, హౌసింగ్ బోర్డు కాలనీ
జేఈఈ ర్యాంకు: 97
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్ కావడం



విద్యార్థి: హర్షవర్ధన్
తల్లిదండ్రులు: రవిశంకర్, శ్రీలక్ష్మి
స్వస్థలం: డోన్
జేఈఈ ర్యాంకు: 263
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం



విద్యార్థి: రఘురాం
తల్లిదండ్రులు: శ్రీరాములు, జయమణి
స్వస్థలం: కర్నూలు, వెంకన్నబావి
జేఈఈ ర్యాంకు: 1,758 (క్యాటగిరీ)
లక్ష్యం: స్టాఫ్‌వేర్ ఇంజినీర్ కావడం

'మట్టి ఎద్దుల' మహా సంబరం

- 150 గ్రామాల్లో అంబరాన్ని అంటిన వేడుక
- అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువకులు



పూజలందుకుంటున్న మట్టి బసవన్నలు

మంత్రాలయం: మట్టి ఎద్దులకు పూజ చేస్తే నేలతల్లి కరుణిస్తుందని రైతులు నమ్మకం. అమావాస్య రోజు పండుగ జరుపుకుంటే సమృద్ధిగా వానలు కురుస్తాయని, నష్టాలు లేకుండా ధాన్యలక్ష్మి ఇంటికి చేరుతుందని విశ్వాసం. కాడెద్దులకు సైతం అనారోగ్యం దరి చేరదని భావిస్తున్నారు. అందుకే ఆదివారం జిల్లా పశ్చిమ ప్రాంతంలో 'మట్టి ఎద్దుల' మహా సంబరాన్ని ఊరూరా జరుపుకున్నారు. పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

కర్ణాటక నుంచి వచ్చిన సంప్రదాయం

ఏరువాక పౌర్ణమి, బసవ జయంతి పర్వదినాలు బసవన్న కోసం జరుపుకుంటారు. సరిహద్దు రాష్ట్రం కర్ణాటక నుంచి సంక్రమించిన పండుగలు ఇవి. ఇలాంటి పండుగే మట్టి ఎద్దుల అమావాస్య. రైతులు మట్టి ఎద్దుల పర్వాన్ని ఎంతో రమణీయంగా చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఆచారంతో కొందరికి ఉపాధి దొరకడం విశేషం.

పర్వదినం ప్రత్యేకత ఇదీ..

ఏరువాక పౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్యనే మట్టి (మంటి) ఎద్దుల అమావాస్యగా జరుపుకుంటారు. వానలు కురవడం.. విత్తు వేసుకునే తరుణంలో ఈ పండుగ వస్తోంది. అమావాస్య తిథి రోజు మట్టితో చేసిన జోడెద్దులను ఇంట్లో కొలువుంచి చూడముచ్చటగా అలంకరణలు చేస్తారు. పిండివంటలు చేసుకుని నైవేద్యాలు సమర్పించి ఎంతో పవిత్రంగా విశేష పూజలు చేస్తారు. కొందరు ఎద్దుల గాటిపాళ్లకు సున్నాలు వేసి మట్టి ఎద్దులను అందులో కొలువుజేసి పూజిస్తారు. సాయంకాలం వేళ ప్రత్యేక వాహనాలపైన.. కొందరు చేతుల్లో ఉంచుకుని డప్పులతో ఊరేగుతూ గ్రామ దేవతలకు నారీకేళాలు సమర్పిస్తారు. గ్రామంలోని బసవేశ్వర ఆలయం లేదంటే శివాలయం చేరుకుని మట్టి ఎద్దులను ఆలయంలో కొలువుంచి శాస్త్రోక్తంగా పూజలు చేస్తారు. అక్కడి నుంచి మట్టిెద్దులను ఇళ్లకు తీసుకెళ్లి ఇళ్లలో దూలాలు, పైకప్పులపై ఏడాదంతా ఉంచుతారు. కొందరు శివాలయంలో వదిలివెళ్లిన మట్టెద్దులను నదుల్లో నిమజ్జనం చేస్తారు. కొన్ని గ్రామాల్లో ఆలయ గోపురాలు, ఆలయ ప్రాంగణాల్లోనూ కొలువు చేస్తారు.

పశ్చిమ పల్లెల్లో కొనసాగుతున్న ఆచారం

కర్ణాటక సరిహద్దు ప్రాంత పల్లెల్లో ఈ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో 150 గ్రామాల్లో వేడుక జరుపుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో 60 పల్లెల్లో పండుగ సందడి కనిపించింది. కౌతాళం మండలంలోని కామవరం, హాల్వి, నదిచాగి, కోసిగి మండలం వందగల్లు, జుమ్మాలదిన్నె, దుద్ది, కందకూరు, సాతనూరు, చిర్తనగల్లు, మూగలదొడ్డి, చిన్నభూంపల్లి, పెద్ద భూంపల్లి, డి.బెళగల్, తుమ్మిగనూరు, అగసనూరు గ్రామాల్లో మట్టి ఎద్దులకు పూజలు చేశారు. ఆదోని మండలంలో 30 గ్రామాల్లో, ఆలూరు నియోజకవర్గం హాలహర్వి, హొళగుంద, ఆలూరు, చిప్పగిరి మండలాల్లోనూ ఈ వేడుక నిర్వహించారు.



కోసిగిలో మట్టి బసవన్నల ఊరేగింపు



మట్టి బసవన్నల తయారీలో కోసిగి గ్రామ కుమ్మరులు

మట్టి ఎద్దులతో ఉపాధి

మట్టి ఎద్దుల పండగలో ప్రకృతి పరమార్థం సైతం దాగి ఉంది. కాలుష్యానికి తావు కుండా స్వచ్ఛమైన మట్టి విగ్రహాలను పూజకు వినియోగిస్తారు. ఫలితంగా మట్టి విగ్రహాల కళాకారులకు ఉపాధి సైతం దొరకుతోంది. వేలల్లో మట్టి ఎద్దు విగ్రహాలు అమావాస్య రోజున విక్రయిస్తారు. కుమ్మరి వృత్తి కళాకారులు ఎక్కువగా ఈ మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. కౌతాళం, ఆదోని, కోసిగి, ఆలూరు ప్రాంతాల్లో కళాకారులు ఉన్నారు. జోడి విగ్రహాలను రూ.40-60 చొప్పున విక్రయిస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో దాదాపు 54 వేల విగ్రహాల వరకు కొనుగోళ్లు జరుగుతాయని అంచనా.

బొమ్మ రూ.50 చొప్పున అమ్మాం



ఆదివారం అమావాస్య సెలవు దినం రావడంతో మట్టిబొమ్మలు బాగా అమ్ముపోయాయి. రూ.50 చొప్పున ఐదు వేలకు పైగా మట్టి ఎద్దులను విక్రయించాను. ఇంటిల్లిపాది వీటిని తయారు చేశాం. పండగతో మాకు ఉపాధి లభించింది. – కుమ్మరి లింగన్న, కౌతాళం

జీవనోపాధి



కోసిగిలో మట్టి ఎద్దుల అమావాస్య పండుగను బాగా చేస్తారు. ఈ ప్రాంతంలో మా కుమ్మరి కులస్తులు 35 కుంటుంబాల వారు మట్టి ఎద్దులు తయారు చేసి అమ్మకాలు చేపడుడుతున్నారు. పండుగ సందర్భంగా ప్రతి ఏటా మాకు జీవనోపాధి దొరుకుతోంది.

– కుమ్మరి రమేష్, కోసిగి

క్లుప్తంగా

పెళ్లి రోజు జరుపుకోకుండానే..


చంద్రకళ(ఫైల్)

పగిడ్యాల: తెల్లవారితే పెళ్లి రోజు వేడుకలు జరుపుకోవాల్సిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పగిడ్యాలకు చెందిన గొల్ల పుల్లన్న కూతురు చంద్రకళ(23)కు ఏడాది క్రితం అల్లూరు గ్రామానికి చెందిన పాయల కృష్ణంరాజుతో వివాహమైంది. వారం రోజుల క్రితం పుట్టింటికి చేరుకుంది. భర్త కృష్ణంరాజు కూడా ఆదివారం ఉదయం వరకు ఇక్కడే ఉండి ఆ తర్వాత అల్లూరుకు వెళ్లాడు. తల్లిదండ్రులు కూడా పని మీద బయటకు వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు కుమార్తె చంద్రకళ ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. సోమవారం పెళ్లి రోజు వేడుక చేసుకోవాల్సిన కుమార్తె మృతి చెంది కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కడుపునొప్పి బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి వరలక్ష్మీ చెబుతోంది. సమాచారం మేరకు తహసీల్దార్ భారతి ఘటన స్థలానికి చేరి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు.

అడవి దాటి గ్రామంలోకి..


ఈర్నపాడులోని ఓ ఇంట్లోకి వచ్చిన చుక్కల దుప్పి

మహానంది: నల్లమలలో నీటివనరులు తగ్గడంతో దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు గ్రామాల వైపు వస్తున్నాయి. ఆదివారం బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలోకి ఓ చుక్కల దుప్పి వచ్చింది. గ్రామంలోని వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడించడంతో భయపడి ఓ ఇంట్లోకి వెళ్లడంతో గ్రామస్తులు గుర్తించి రక్షించారు. వెంటనే వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్ఆర్ఓ నాసిర్‌జా ఆదేశాల మేరకు సిబ్బంది రామకృష్ణ, ప్రొటెక్షన్ వాచర్లు గ్రామానికి చేరుకుని దుప్పిని ఆటోలో తీసుకెళ్లి ఓంకారం సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు.

నేడు రెండవ విడత కౌన్సెలింగ్

డోన్ టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలి పోయిన సీట్ల భర్తీ కోసం సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ప్రసాద్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో సీటు దక్కని వారు మాత్రమే రెండవ విడత కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన మెరిట్‌లో 1 నుంచి 850 వరకు సోమవారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ప్రణాళికతో చదివితే కొలువు సులువే!

- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి త్వరలోనే భారీగా నోటిఫికేషన్స్
- ఉత్తమ శిక్షణ సంస్థలను ఎంపిక చేసుకోవాలి
- సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.అబ్దుల్ కరీం


స్కాలర్‌షిప్ టెస్టులో ద్వితీయ స్థానం సాధించిన వరప్రసాదుకు బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: చక్కని ప్రణాళికతో చదివితే కోరుకున్న కొలువును సులువుగా సాధించవచ్చని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీల పరీక్షలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేందుకు సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సుకు నిరుద్యోగ యువతీ, యువకులు భారీ ఎత్తున హాజరయ్యారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి గ్రూప్–1, గ్రూప్–2 పోస్టులు వెయ్యికిపైగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటోందని అధ్యాపకులు తెలిపారు. పరీక్షల విధానం, మారిన సిలబస్, విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరిక్రిష్ణ, (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎం.డి పాషా(ఎకనామీ), బి.కృష్ణారెడ్డి(పాలిటీ), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) అవగాహన కల్పించారు. ముందుగా ఆర్‌సీ ఎగ్జామ్ సెంటర్ చైర్మన్ ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులైన లెజెండరీ ఫ్యాకల్టీలతో కరోనా సమయం నుంచి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో తమ సంస్థ ద్వారా 25 వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొందరాని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగాలు సాధించారన్నారు. తెలుగు, ఇంగ్లిష మీడియంలలో నేటి(సోమవారం)నుంచే కొత్త బ్యాచ్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8985094499 నంబరులో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. హైదరాబాద్‌కు రాలేని ప్రైవేటు ఉద్యోగులు, గృహిణుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆర్.సీ ఎగ్జామ్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిషు మీడియంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాక్షి యాడ్స్ మేనేజర్ చంద్రశేఖర్, ఈవెంట్ మేనేజర్ చంద్ర తదితరులు మాట్లాడారు.


సదస్సుకు హాజరైన యువతీ యువకులు

భవిష్యత్తుకు భరోసా



నేను సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లొచ్చాను. గ్రూప్–1 ఉద్యోగం సాధించి రిజిస్ట్రేషన్ శాఖలో పని చేశాను. అయితే టీచింగ్‌పై ఉండే మక్కువతో మూడు దశబ్దాలుగా హిస్టరీ బోధకుడిగా పని చేస్తున్నాను. తెలంగాణ, ఢిల్లీ, బెంగళూరు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోను వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో పోటీ పరీక్షల కోసం ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించాం. ఆర్.సీ ఎగ్జామ్ సెంటర్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి వేలాది సబ్జెక్టు వీడియోలు యాప్‌లో అప్‌లోడ్ చేశాం. యూపీఎస్సీ స్థాయిలో మేం కోచింగ్ ఇస్తున్నాం. జిల్లావాసిగా ఈ ప్రాంత నిరుద్యోగులకు మేలు చేయాలనే ఉంది. – డాక్టర్ ఎం. అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకం



ఏపీపీఎస్సీ మూడు నెలల క్రితమే గ్రూప్స్ సిలబస్‌లో మార్పులు చేసింది. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది చాలా కీలకం. దీనిని కరెంట్ అఫైర్స్‌లో భాగంగానే పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఇందులో ఏయే టాపిక్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయో కూడా అవగాహన ఉండాలి. – సి.హరిక్రిష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

సమయం ప్రధానం



సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారు చక్కని ప్రణాళిక వేసుకుంటేనే విజయం సులువు అవుతుంది. పోటీ పరీక్షలకు సమయం అనేది చాలా కీలకం. ఎకానమీ అనేది గతం, వర్తమానంతో పాటు, కరెంట్ అంశాలను గూగుల్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. నోటిఫికేషన్ కోసం ఎదురుచూడకుండా ఆలోపు నిర్దేశిత సిలబస్ మేరకు ప్రిపరేషన్ మొదలు పెట్టి పూర్తి చేయాలి. నోటిఫికేషన్ వచ్చాక కేవలం క్లిష్టతర అంశాలను ఎక్కువగా దృష్టి పెట్టాలి. – ఎం.డి పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

అన్ని అంశాలపై అవగాహన ఉండాలి



గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు మొదటగా సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. మెంటల్ ఏబిలిటీ అనేది అర్థం చేసుకుని చదవాలి. పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారు అందరిలాగా కాకుండా విభిన్నంగా ఆలోచించాలి. – శంకర్‌రెడ్డి, మెంటల్ ఏబిలిటీ

విభిన్న ఆలోచనలతో సన్నద్ధం కావాలి



పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తారు. అందులో తక్కువ మంది మాత్రమే గ్రూప్స్ సిలబస్ గురించి అవగాహన ఉంటుంది. ఇందులో అంశాల పరిధిని చాలా విస్తృతంగా చదవాలి. ప్రశ్నల సరళిలో చాలా మార్పులు చేశారు. ప్రతి అంశంపై చాలా లోతుగా ఆలోచనలు చేసి, విభిన్నంగా సన్నద్ధం కావాలి. – బి.కృష్ణారెడ్డి, పాలిటీ, ఫ్యాకల్టీ

స్ఫూర్తిని కలిగించారు



గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమానికి మొదటిసారి హాజరయ్యాను. ఈ సదస్సు ద్వారా చాలా మందిలో స్ఫూర్తి నింపారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ముందుగా ఆత్మస్థైర్యం అనేది కీలకం. పరీక్షల సన్నద్ధత, సిలబస్ తదితర అంశాలపై ఫ్యాకల్టీ వివరించిన తీరు ఆకట్టుకుంది. – మహేశ్వరి

కాకినాడ నుంచి వచ్చాను



గ్రూప్–2 పరీక్షలపై అభ్యర్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారని పేపర్‌లో చూశాను. అందుకే కాకినాడ నుంచి అవగాహన సదస్సు కోసం వచ్చాను. ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ ఏర్పాటు చేసిన ఆఫ్‌లైన్ తరగతుల అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కచ్చితంగా గ్రూప్–2 ఉద్యోగం సాధిస్తామనే నమ్మకం కలిగింది. వారు నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్షలో రెండో విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. – జి.వరప్రసాద్, కాకినాడ, సచివాలయ ఉద్యోగి

చక్కని మార్గనిర్దేశం



గతంలో చాలా పోటీ పరీక్షలకు హాజరయ్యాను. గ్రూప్స్ పరీక్షలు అంటేనే చాలా పోటీ ఉంటుంది. ఈ పోటీలో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫ్యాకల్టీ చాలా చక్కగా వివరించారు. పోటీ పరీక్షలకు తొలిసారి సన్నద్ధం అయ్యేవారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించాలి, ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలి అనేదానిపై స్పష్టత వచ్చింది. – రాఘవేంద్ర, సచివాలయం ఉద్యోగి

గ్రూప్–2పై మంచి అవగాహన



గ్రూప్–2 పరీక్షలపై నిరుద్యోగ అభ్యర్థులకు మంచి అవగాహన కల్పించారు. ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ, సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు చాలా చక్కగా ఉంది. టీచింగ్ ఫ్యాకల్టీ పరీక్షల సన్నద్ధతపై మంచి అవగాహన కల్పించారు. – బి.ఎస్ చౌదరి, నంద్యాల

పల్లెల్లో పచ్చదనం పెంపునకు కృషి

- జూలై 31 నాటికి లక్షకు పైగా మొక్కలు నాటడమే లక్ష్యం
- డీపీఓ టీ నాగరాజునాయుడు



కర్నూలు(అర్బన్): మిషన్ లైఫ్ – లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పల్లెల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ప్రతి గ్రామ పంచాయతీలో 200 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో అదనంగా 200 మొక్కలు నాటేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు. ఈ లెక్కన మొత్తం గ్రామ పంచాయతీల్లో 96,800 మొక్కలు, 25 మండల కేంద్రాల్లో 5 వేల (మొత్తం 1,01,800) మొక్కలను నాటనున్నట్లు వివరించారు. డ్వామా, అటవీ శాఖ అధికారులను కలిసి ఆయా మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలకు సమీపంలోని నర్సరీల నుంచి ఈ మొక్కలను తీసుకోనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నాటిన ప్రతి మొక్క బతికేందుకు వీలుగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా, ఇళ్ల ముందు మొక్కలను నాటేందుకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు. నాటిన మొక్కలపై వలంటీర్ల పర్యవేక్షణ ఉండేలా చూస్తామన్నారు.





కూల్..కూల్‌గా.. ట్రాఫిక్‌లో విధులు!

జూన్ నెల ముగుస్తున్నా భానుడు తన ప్రతాపాన్ని తగ్గించుకోలేదు. పగటిపూట ఎండలు మండిపోతున్నాయి. భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్ల మీదకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు హాయిగా విధులు నిర్వర్తించడం కోసం పోలీస్ శాఖ ఏసీ హెల్మెట్లను అందజేసింది. వీటి తలపై ఉంచుకుని కూల్..కూల్‌గా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. – సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

కోడుమూరు రూరల్: కోడుమూరు – కర్నూలు రహదారిలో ప్యాలకుర్తి సమీపంలో లారీ.. ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గోనెగండ్లకు చెందిన వీరపోగు భాస్కర్ (45) భార్య నర్సమ్మ, అల్లుడు సురేంద్రతో కలిసి ఆదివారం కర్నూలుకు ఆటోలో వెళుతుండగా, కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న లారీ ప్యాలకుర్తి గ్రామ సమీపంలో వేగంగా ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం 108 వాహనంలో వైద్య సిబ్బంది కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వీరపోగు భాస్కర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సారు.. మా కొద్దు!

పత్తికొండ రూరల్: ఆ ఉపాధ్యాయుడు ఉంటే తమ పిల్లలను బడికి పంపించలేమని హోసూరు గ్రామానికి చెందిన కొందరు తల్లిదండ్రులు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గాజుల రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేవీ రమణ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, స్థానికంగా ఉండే పీఎంసీ కమిటీతో చర్చించి ఏం చేయాలో ఆలోచిస్తామని తల్లిదండ్రులకు హెచ్‌ఎం సమాధానమిచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేవీ రమణ గతంలో పుచ్చకాయలమాడ జెడ్పీ స్కూల్‌లో కూడా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు.



ఇదే కదా తల్లి ప్రేమ



మేతకు అడవికి వెళ్లిన ఆవు.. పులి కంటబడటం.. ఒకసారి అవకాశం ఇస్తే ఇంటి వద్ద ఉన్న లేగ దూడకు పాలిచ్చి తోటి పశువులకు అప్పగిస్తానని వేడుకోవడం, అందుకు పులి ఒప్పుకోవడం.. చెప్పినట్లుగానే ఆవు ఇంటికెళ్లి తిరిగి రావడం .. ఆవు నిజాయితీని చూసి పులి చంపకుండా వదిలేయడం.. ఈ కథ అందరూ చదివే ఉంటారు. ఈ కథలో నిజాయితీతో పాటు తల్లి ఆవు మమకారం కూడా కనిపిస్తోంది. ఈ కథ ఇప్పుడెందుకంటరా.. తల్లి మమకారానికి నిదర్శనంగా కోవెలకుంట్ల పట్టణంలో ఓ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం మేతకు వెళ్లిన ఆవు తిరిగి వస్తుండగా కోడెదూడ ఆకలితో ఎదురెళ్లింది. వాహనాలు వస్తున్నా పక్కకు కదలకుండా అలాగే నిలబడి కోడెదూడకు పాలిచ్చి ఆకలి తీర్చింది. పది నిమిషాల పాటు ఆవు పాలిస్తుండగా వాహన చోదకులు కూడా అంతరాయం కలిగించకుండా వాహనాలను పక్కకు తిప్పుకుని వెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు 'ఇదే కదా తల్లి ప్రేమ' అంటూ చర్చించుకున్నారు. – కోవెలకుంట్ల

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మనాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే

సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అములులో నిలపాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి ; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికిఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!

గురువాణి

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...


''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.



పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు.

అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధపడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



రవితేజ

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ

- దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



● శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ




● మహేశ్‌బాబు

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

మా నాన్న సూపర్ హీరో!



● సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?



● రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

- నందితా శ్వేత



● అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

సంక్రాంతికి జాతర



● ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.